ప్రజాశక్తి
గురువారం 25 డిసెంబరు 2025 5
శ్రీకాకుళం

ప్రముఖుల క్రిస్మస్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి, శ్రీకాకుళం సిటీ

క్రిస్మస్ సందర్భంగా జిల్లాలోని క్రైస్తవులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, కరుణ, త్యాగం, క్షమ వంటి విలువలు సమాజానికి శాశ్వత మార్గదర్శకాలని పేర్కొన్నారు. క్రీస్తు బోధనలు సమాజంలో ప్రేమ, కరుణ, శాంతిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మానవత్వానికి ప్రతీకగా నిలిచిన క్రీస్తు జీవితం, ప్రతి ఒక్కరిలో సేవాభావం, సహనం, శాంతిని పెంపొందించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుందని తెలిపారు. మత భేదాలకు అతీతంగా జీవిస్తూ, రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు.

'ఉపాధి'కి ఎసరు

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు పనులు కల్పించి, వలసలు నివారించే ఉద్దేశంతో నాడు యుపిఎ-1 హయాంలో వామపక్షాలు పట్టుబట్టి సాధించిన ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ఒడిగట్టింది. ఏటా లక్షలాది మందికి కల్పిస్తున్న ఉపాధి చట్టానికి గండి కొట్టాలని చూస్తోంది. చట్టానికి ఉన్న పేరు మార్చి, వాటాను తగ్గించి నానా విన్యాసాలు చేస్తోంది. చట్టానికి ఇప్పటివరకు ఉన్న మహాత్మాగాంధీ పేరును తొలగించి, దాని స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవకా మిషన్ (విబిజిఆర్‌ఎఎంజి) కొత్త పేరును తీసుకొచ్చింది. చట్టం అమలుకు ఇప్పటివరకు 90 శాతం నిధులు ఇస్తుండగా, దాన్ని 60 శాతానికి కుదించి నిరుపేదలపై నిర్దయగా వ్యవహరిస్తోంది.

- ఉపాధి హామీ చట్టానికి మోడీ ప్రభుత్వం తూట్లు
- కొత్త చట్టంలో అనేక వినాశకర నిర్ణయాలు
- అడిగిన వెంటనే పనులు దొరకడం ఇక కష్టమే
- మండిపడుతున్న కూలీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 4.31 లక్షల మందికి జాబ్‌కార్డులు జారీ చేయగా, అందులో 7.2 లక్షల మంది కూలీలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జాబ్‌కార్డుల్లో 3.77 లక్షలు మనుగడలో ఉండగా, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 5.85 లక్షల మంది కూలీలు క్రమం తప్పకుండా పనుల్లోకి వస్తున్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 3.16 లక్షల కుటుంబాలు పనుల్లోకి వచ్చాయి. మొత్తం 3,036 కుటుంబాలకు వంద రోజుల పని కల్పించారు. 2025-26 సంవత్సరానికి రూ.534.40 కోట్లను ఖర్చు చేశారు. అందులో కూలీలకు రూ.322.36 కోట్లను కూలి కింద చెల్లించారు. మెటీరియల్ కాంపొనెంట్, కూలీ డబ్బుల చెల్లింపుల కోసం రూ.192.78 కోట్లను చెల్లించారు. జిల్లాలో భూమి లేని నిరుపేదలు ఉపాధి చట్టంపై ఏ స్థాయిలో ఆధారపడుతున్నారో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఫిబ్రవరి నుంచి మే వరకు ఉపాధి పనులకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. వ్యవసాయ పనులు లేకపోవడంతో, కూలీలంతా ఈ పనుల కోసమే ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది.

కరోనా కాలంలో కల్పతరువు

ఉపాధి హామీ చట్టం ఎంతగా ఆదుకుందో, కరోనా కాలంలో పనులకు వచ్చిన కూలీల సంఖ్యే స్పష్టం చేస్తోంది. చట్టం అమలైన నాటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో గరిష్టంగా 3.50 లక్షల మంది కూలీలు పనుల్లోకి రాగా, 2021 కరోనా కాలంలో జరిగిన పనులకు ఏకంగా 5.50 లక్షల మంది పనుల్లోకి వచ్చారు. జిల్లా నుంచి వలస వెళ్లిన వారంతా తిరిగి వెనక్కి వచ్చేయడంతో, పనుల్లేక విద్యావంతులు సైతం ఉపాధి పనులకు వచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వంపై 'ఉపాధి' భారం

చట్టంలో ఏడాదికి వంద రోజుల పని దినాలు కల్పించాలనే నిబంధన ఇప్పటివరకు ఉండేది. ప్రజలు మభ్యపెట్టేందుకు 125 రోజులకు పెంచుతున్నట్టు చట్టంలో పేర్కొన్నా, కేంద్ర ప్రభుత్వం తన వాటా కుదించడం గమనార్హం. చట్టం అమలుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు 90 శాతం నిధులు సమకూర్చుతుండగా, ఇకపై 60 శాతమే ఇవ్వనుంది. రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన 40 శాతం నిధులను కేటాయించాల్సి ఉంటుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదనే నెపంతో అన్నింటినీ పిపిపికి అప్పగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఆ మేరకు నిధులు కేటాయించడం సందేహంగానే ఉంది.

అడుగడుగునా ఉపాధికి గండికొట్టే యత్నం

ఉపాధి నిధుల పైనే ఆధారపడి గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, విలేజ్ క్లినిక్‌లు, రైతుసేవా కేంద్రాలు తదితర మౌలిక వసతులను సమకూరుతున్నాయి. చివరకు ఏ పార్టీ అధికారంలోకి వస్తే వారికి కాంట్రాక్టు పనులు చేసుకోవడానికి ఇది ఒక ఆర్థిక వనరుగా మారింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులతో వారి ఉపాధికీ గండి పడనుంది.

ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం అడుగడుగునా దెబ్బ తీస్తోంది. మోడీ ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు గత పదేళ్లలో అనేక మార్పులు రకరకాల షరతులను పెడుతోంది. ఈ-మస్తరు పేరుతో మొబైల్ ద్వారా మస్తర్లు వేయించడం, ఫేషియల్ అటెండెన్స్ వంటి విధానాలతో కూలీలను పనులకు దూరం చేసే విధానాలను అవలంభిస్తోంది. ఉపాధి కూలీలకు అదనంగా చెల్లించే వేసవి భృతిని మూడేళ్లుగా కేంద్రం ఆపేసింది. వేసవిలో పనికి హాజరయ్యే కూలీలకు గతంలో మజ్జిగ కోసం రోజుకు రూ.5 చొప్పున అదనంగా చెల్లించేవారు. దాన్నీ నిలిపేశారు. సాధారణ రోజుల్లో తాగునీటి కోసం రూ.5 చొప్పున చెల్లించే విధానాన్నీ ఎత్తేసింది.

ఉపాధి నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

ఉపాధి చట్టం నిర్వీర్యానికి కేంద్రంలోని మోడీ సర్కారు కుట్ర పన్నుతోంది. అందులో భాగమే చట్టంలో మార్పులు, కేంద్రం వాటాలో నిధులు తగ్గింపు నిర్ణయాలకు పాల్పడింది. కేంద్ర ప్రభుత్వం అటు భాగస్వామ్య పక్షాలతో గానీ ఇటు ప్రతిపక్షాలతో గానీ చర్చించకుండా బిల్లును ఆమోదించి చాలా నిరంకుశంగా వ్యవహరించింది. గ్రామీణ ప్రాంత పేదలు, వ్యవసాయ కార్మికుల పొట్ట కొట్టేలా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రభుత్వ తీరుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఉపాధి చట్టం పరిరక్షణకు రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

- గంగరాపు సింహాచలం,
రాష్ట్ర ఉపాధ్యక్షులు, వ్యవసాయ కార్మిక సంఘం

ఉపాధి పనులే ఆధారం

మాకు సెంటు భూమి లేదు. ఇద్దరు భార్యభర్తలం పనులకు వెళ్తున్నాం. ఉపాధి పనులపైనే ఆధారపడి బతుకుతున్నాం. కూలి డబ్బులతోనే కాస్తాకూస్తో గంజి నీళ్లు తాగుతున్నాం. ఇప్పుడు పనులు ఇవ్వలేమంటే వలసలే గతి.

- దాసరి కుమారి, ఉపాధి కూలీ, సతివాడ, గార

పనులు లేకుంటే వలస పోవాల్సిందే

వ్యవసాయ పనులు అంతగా ఉండడం లేదు. అన్నింటికీ యంత్రాలతో చేస్తుండడంతో పనులకు పిలవడం లేదు. ఉపాధి పనులు లేకుంటే కష్టమే. ఊరొదిలి వెళ్లిపోవాల్సిందే. ప్రభుత్వం ఉపాధి చట్టానికి డబ్బులు కేటాయించి మాకు పనులు కల్పించాలి.

- కిర్రు రామ్ములమ్మ, ఉపాధి కూలీ,
సతివాడ, గార

మాట్లాడుతున్న జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ ఛైర్మన్ రఘుపాత్రుని చిరంజీవి

డిజిటల్ న్యాయ పాలనతో సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వినియోగదారుల హక్కులను డిజిటల్ న్యాయ పాలన ద్వారా సత్వరం పరిష్కరించవచ్చని జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ ఛైర్మన్ రఘుపాత్రుని చిరంజీవి అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం వస్తు సేవల కొనుగోళ్లలో రక్షణగా నిలుస్తుందన్నారు. వినియోగదారుల కోర్టులో ఆన్‌లైన్, ఈ-కామర్స్ వంటి సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. రూ.ఐదు లక్షల్లోపు కేసులు రుసుము లేకండా విచారణకు స్వీకరించనున్నట్లు చెప్పారు. వినియోగదారుల కోర్టు వినియోగదారుల హక్కులు, మోస వ్యాపార ప్రకటనల రక్షణ, కేంద్రీయ వినియోగదారుల రక్షణ అథారిటీ ఏర్పాటు, ఆన్‌లైన్ వివాదాల పరిష్కారం వంటివి చేపడుతుందని చెప్పారు. డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థ, సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా పౌర సరఫరాల అధికారి జి.సూర్య ప్రకాష్ తెలిపారు. వినియోగదారుల హక్కులపై ప్రజల్లో అవగాహన ముఖ్యమన్నారు. ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారునికి హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయని గుర్తుచేశారు.

తూనికలు, కొలతలకు సంబంధించి మోసాలను గమనించి వినియోగదారులు ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. లీగల్ మెట్రాలజీ, ఫుడ్ కంట్రోల్, డ్రగ్ కంట్రోల్, రోడ్డు రవాణా సంస్థ, జిల్లా కోఆర్డినేటర్ హాస్పిటల్స్ శాఖలకు సంబంధించి వినియోగదారులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ పి.చిన్నమ్మ, డ్రగ్స్ కంట్రోల్ ఎడి ఎం.చంద్రరావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు పాల్గొన్నారు.

26వేల మెట్రిక్ టన్నుల ఎరువుల పంపిణీకి ప్రణాళిక

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత లేదని, రైతులకు అవసరమైన యూరియాను తగినంతగా అందుబాటులో ఉంచామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. 2025-26 రబీలో అన్ని రకాల పంటలకు గానూ మొత్తం 26 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. అక్టోబరు 1 నుంచి ఈనెల 23వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 11,141 మెట్రిక్ టన్నుల విక్రయాలు జరిగాయని, ప్రస్తుతం పలు కేంద్రాల్లో 1,859 మెట్రిక్ టన్నుల నిల్వలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. దేశీయ ఉత్పత్తితో పాటు దిగుమతులూ ఆశాజనకంగా ఉన్నందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సంప్రదాయ ఎరువులకు ప్రత్యామ్నాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న నానో యూరియా, నానో డిఎపిలను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలోని కో-ఆపరేటివ్ సొసైటీలు, రైతుసేవా కేంద్రాలు, మార్క్‌ఫెడ్ గోదాములు, ప్రైవేట్ రిటైల్, హోల్‌సేల్ డీలర్ల వద్ద ఎరువుల విక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

ఎరువుల విక్రయాల్లో డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించినా, ఇతర ప్రాంతాలకు మళ్లించినా, ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధరకు విక్రయించినా ఎరువుల నియంత్రణ చట్టం-1985 ప్రకారం లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. రైతులు బస్తాలపై ఉన్న ధరను గమనించి, కొనుగోలు చేసిన వెంటనే డీలర్ల నుంచి తప్పనిసరిగా రశీదు పొందాలని సూచించారు.

క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఆమదాలవలస మండలంలోని గాజులకొల్లివలస పంచాయతీ పరిధిలో సంగమేశ్వర స్వామి కొండ దిగువన ఏసుక్రీస్తు సైకత శిల్పం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. సైకత శిల్పి గేదెల హరికృష్ణ రూపొందించిన ఈ సైకత శిల్పాన్ని చుట్టుపక్కల గ్రామస్తులు తిలకించారు. హరికృష్ణ ప్రతిభను ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

క్రిస్మస్ సందడి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను సందడిగా నిర్వహించారు. అన్ని చర్చిల్లో బుధవారం సాయంత్రం నుంచే చర్చిల్లో వేడుకలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి కేకును కోసి ఏసుక్రీస్తును స్తుతిస్తూ గీతాలను ఆలపించారు. శ్రీకాకుళం చిన్నబజారు లోని తెలుగు బాప్టిస్టు చర్చి, ఉమెన్స్ కాలేజ్ రోడ్డులోని క్రిస్టియన్ వర్షిప్ సెంటర్, కోడి రామ్మూర్తి స్టేడియం సమీపంలోని సెయింట్ జాన్ లూథరన్ చర్చి, డగ్లస్ స్కూల్ క్యాంపస్‌లోని కీన్‌స్టోన్ చర్చి, పాత శ్రీకాకుళంలోని రార్డ్ అసెంబ్లీ చర్చి, పురుషుల డిగ్రీ కళాశాల సమీపంలోని ఆర్‌సి ఎం చర్చి, టౌన్‌హాల్ వద్ద సెయింట్ థామస్, పలాసలోని సీయోన్‌గ్రీస్, హెర్మాన్ గ్రీస్, ఇచ్ఛాపురంలో పలు చర్చిల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

విద్యుత్ కాంతుల్లో ఇచ్ఛాపురంలోని ఓ చర్చి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మండలంలోని నిమ్మాడలో గల క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు అందుతున్నాయన్నారు. నూతన పెన్షన్లు, ఇళ్ల మంజూరు చేయాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధుల నిర్వహణలో అలసత్వం లేకుండా, బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు.

వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు

పార్టీ బలోపేతానికి నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఇటీవల టిడిపి అధిష్టానం అరకు పార్లమెంటరీ అధ్యక్షులుగా మోజూరు తేజోవతిని నియమించిన నేపథ్యంలో, ఆమె మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పర్యావరణ పరిరక్షణతోనే రేపటి తరాలకు భవిష్యత్ అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. పాన్ ఇండియా ఎన్విరాన్‌మెంటల్ లీగల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో పర్యావరణ, పారిశ్రామిక అధికారులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాల నిర్వహణలో చట్టపరమైన నిబంధనలు పాటించడం అత్యవసరమన్నారు. పర్యావరణ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అధికారులకు సూచించారు. పర్యావరణాన్ని కలుషితం చేయడం వల్ల కలిగే చట్టపరమైన ఇబ్బందులను గుర్తు చేశారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఈ పథకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కరుణశ్రీ, పలు పరిశ్రమల ప్రతినిధులు, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఐసిడిఎస్‌లో కమీషన్ల వివాదం

అధికారులతో విప్ అశోక్ సమీక్ష

ప్రజాశక్తి - కవిటి

సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్) ఇచ్ఛాపురం ప్రాజెక్టులో అధికారుల మధ్య సాగుతున్న అంతర్గత గొడవలపై ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విమల సమక్షంలో ఐసిడిఎస్ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సిడిపిఒ రాజేశ్వరి, కంప్యూటర్ ఆపరేటర్ లోకనాథం మధ్య కొంతకాలంగా ఉన్న విభేదాలు ఈ సమావేశంలో బట్టబయలయ్యాయి. విప్ సమక్షంలోనే వీరిద్దరూ పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. అంగన్వాడీ కార్యకర్తల నుంచి దసరా మామూళ్ల వసూలు చేసిన వ్యవహారం, పిఒ ప్రయాణ ఖర్చులపై రికార్డుల వివాదం బయటపడింది. గుడ్లు, పౌష్టికాహార సరఫరాలో పిఒ కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని కంప్యూటర్ ఆపరేటర్ లోకనాథం ఆరోపించారు. అంగన్వాడీ యూనియన్ నేతలు సైతం సమస్యలను ప్రస్తావించారు. ఈ వ్యవహారాలపై ఎమ్మెల్యే అశోక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వివాదాలకు స్వస్తి పలికి ప్రభుత్వ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. లేదంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

ప్రయాణికులకు మెరుగైన సేవలు

జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ

ప్రజాశక్తి - పలాస

జిల్లాలో ఆర్‌టిసి సేవలను ప్రయాణికులకు మరింత చేరువ చేయాలని జిల్లా ప్రజారవాణా అధికారి సిహెచ్.అప్పలనారాయణ అన్నారు. పలాస ఆర్‌టిసి డిపోతో పాటు గ్యారేజ్, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట ఆర్‌టిసి కాంప్లెక్స్‌లను డిపో మేనేజర్ శ్యామ్‌సుందర నాయుడుతో కలిసి బుధవారం పరిశీలించారు. డిపోలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, మౌలిక సదుపాయాలు ఉన్నాయా, కాంప్లెక్స్‌ల్లో ఫ్యాన్లు, మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం పలాస డిపోలో ఆర్‌టిసి కార్మికులకు అభినందన సభ నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరులో ఆదాయం పెంచిన వారిని, డీజిల్ పొదుపు చేసిన వారిని, జనవరి నుంచి నవంబరు వరకు మెరుగ్గా పనిచేసిన వారిని, బ్రేక్ డౌన్ కాకుండా చేసిన మెకానిక్‌లను అభినందన సభలో సత్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఇ బమ్మిడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వికలాంగుల క్రీడా పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వికలాంగ విద్యార్థుల క్రీడా పోటీలు నగరంలోని కోడి రామ్మూర్తి మైదానంలో బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వికలాంగ విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 90 మంది వికలాంగ క్రీడాకారులు పాల్గొన్నారు. 100, 400, 800 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్ వంటి అంశాల్లో నిర్వహించిన జోనల్ లెవల్ అడ్వెంచర్ స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు రిబ్బన్ కట్ చేసి జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగ విద్యార్థులు సాధారణ విద్యార్థుల్లా క్రీడల్లో రాణించవచ్చన్నారు. రాష్ట్ర పరిశీలకులు వై.నరసింహం మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన పదిమంది విద్యార్థులకు గండికోటలో నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చి, పర్వతారోహణకు సిద్ధం చేస్తామని చెప్పారు. వికలాంగ విద్యార్థులకు డిజిటల్ విద్య, క్రీడలు, మార్షల్ ఆర్ట్స్, కల్చరల్ పలు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి శ్రేయస్సుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సహిత విద్య సాకారం కావడానికి కృషి చేస్తున్న సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర పారాఒలింపిక్స్ అసోసియేషన్ తరపున టెక్నికల్ సహాయకులు శంకర్, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల సహిత విద్య సమన్వయకర్తలు బుడుమూరు గోవిందరావు వి.ఉమా సూర్యారావు, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోటీను ప్రారంభిస్తున్న డిఇఒ రవిబాబు

ప్రకటన
మహారాజశ్రీ సోంపేట ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి కోర్టులో
O.S 45/2024

గౌరు రాజేశ్వరి ......వాది
మరియు:
ఉగ్రపల్లి రామలక్ష్మి వగైరాలు .....ప్రతివాదులు

To,
D-3: గురుజు హేమలత, W/o నరసింగు గార్కి

పై నెంబరు దావా షెడ్యూలు దాఖలా ఆస్తులు పాయింపు నిమిత్తము, గౌరు రాజేశ్వరి/వాది దావాను దాఖలు చేయగా సదరు దావా నోటిసులు మీకు పేపరు పబ్లికేషను ద్వారా అమలు కాబడుటకు గాను. తే **31-12-2025 దీకి వాయిదా అయివున్నది.** కాబట్టి మీరు సదరు దినమున **ఉదయం గం॥ 10-30 ని॥** లకు కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపలు కోర్టువారికి మనవి చేయవలెను. లేని ఎడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించడం అగునని ఇందు మూలంగా తెలియపరచడమైనది.

మడ్డు సర్వేశ్వరరావు
వాది తరుపున న్యాయవాది,
సోంపేట,
శ్రీకాకుళం జిల్లా.

మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

మాతృత్వం వరం... దత్తత మరో మార్గం

ప్రజాశక్తి- పలాస

మాతత్వం అనేది ఒక వరమని... అందుకు దత్తత ద్వారా పిల్లలను పెంచుకోవడం మరో మార్గమని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులు అన్నారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమం, మిషన్ వాత్సల్య జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో పలాస కాశీబుగ్గ మున్సిపల్ సమావేశ మందిరంలో అంగన్వాడీ కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలలు నిండిన పిల్లల నుంచి 18 ఏళ్ల వరకు దత్తత తీసుకోవచన్నారు. పాన్ కార్డు ద్వారా మిషన్ వాత్సల్య వెబ్‌సైట్ ద్వారా పిల్లల దత్తత కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దత్తత తీసుకున్న తరువాత జిల్లా మెజిస్టేట్ వద్ద దత్తత బిడ్డతో సహా హాజరై దత్తత ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నారు. దత్తత తీసుకోవాలనుకున్న వారు ఫ్యామిలీఫొటోతో పాటు వివిధ ఆదాయ, నివాసవంటి ధ్రువపత్రాలు తహశీల్దార్‌చే గుర్తించబడినవి అప్‌లోడ్ చేయాలన్నారు. దత్తత తీసుకున్న తరవాత ప్రతీ ఆరు నెలలకు ఫాల్‌అవ్ విజిట్ ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు ఆరు వేలు, దత్తత సంస్థకు రూ.50 వేలు చెల్లించాలని, ఫాల్‌అవ్ ఫీజు కూడా చెల్లించాలన్నారు. దత్తత తీసుకున్న తల్లిదండ్రులు శారీరకంగా, ఆరోగ్యకరంగా, ఆర్థికంగా బాగుండాలని, దీర్ఘకాలిక వ్యాధులు, నేరపూరిత కేసుల్లో దోషిగా ఉంటే వారికి దత్తత ఇవ్వడం చెల్లదన్నారు. ఈ విషయాలను అంగన్వాడీ కార్యకర్తలు దత్తత తీసుకునే తల్లిదండ్రులకు వివరించి, వారికి మాతృత్వం దత్తత ద్వారా మరో వరంగా అవకాశం కల్పించడం జరుగుతుందని వారికి చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ పార్వతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

హెల్పింగ్ హ్యాండ్స్ ఉదారత

ప్రజాశక్తి- కవిటి

బొరివంక గ్రామానికి చెందిన గుడియా ముకుంద భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో ఉంది. ముకుంద ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న హెల్పింగ్ హేండ్స్ సభ్యులు తక్షణ సాయంగా రూ.5,300 నగదుతో పాటు నెలరోజుల పాటు సరిపడే నిత్యావసర సరుకులు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కష్టకాలంలో నిరంతరం అండగా ఉంటామని భరోసా ఇస్తూ ఆ కుటుంబానికి సహాయం చేశారు. ఈ సందర్భంగా సహకరించిన ప్రతిదాతకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా మరింత మంది దాతలు మానవత్వ దృక్పథంతో ముందుకు వచ్చి ఆ కుటుంబానికి సహాయం చేయాలని వారు కోరారు.

టిడిపి విజయనగరం జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- లావేరు

శ్రీనివాసరావు

విజయనగరం జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షునిగా మండలంలోని బెజ్జపురం గ్రామానికి చెందిన వడ్డుపల్లి శ్రీనివాసరావును టిడిపి అధిష్టానం నియమించింది. శ్రీనువాసరావు పార్టీలో చురుగ్గా వ్యవహరించడంతో పాటు పార్టీ అభివృద్ధికి గత కొన్నేళ్లుగా కష్టపడి పని చేయడంతో పార్టీ గుర్తించి పార్లమెంట్ ఉపాధ్యక్షునిగా నియమించడంతో పార్టీ శ్రేణుల్లో హర్షతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. శ్రీనువాసరావు పదేళ్లపాటు టిడిపి గ్రామశాఖ ఉపాధ్యక్షునిగా, కార్యదర్శిగా కొనసాగారు. పంచాయతీ వార్డు మెంబర్‌గా నాలుగు పర్యాయాలు ఎన్నికయ్యారు. ప్రస్తుతం టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జిగా వ్యవహారిస్తూ ఇప్పుడు జిల్లా ఉపాధ్యక్షునిగా నిలయమితులయ్యారు.

శ్రీనివాసరావు నియామకంపై టిడిపి నాయకులు, టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ప్రధాన కార్యదర్శి పిన్నింటి మధుబాబు, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి మీసాల వెంకట రమణ, మాజీ జెడ్‌పిటిసి పిన్నింటి శ్రీదేవి, ఆర్.ప్రకాశరావులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

పరిశ్రమ కాలుష్యంపై అధికారుల తనిఖీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

తనిఖీ చేస్తున్న అధికారులు

మండలంలోని రావి వలస గ్రామంలోని ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమను బుధవారం శ్రీకాకుళం కాలుష్య నియంత్రణ అధికారులు ఎఇ హరీష్, అనలిస్ట్ రాంబాబు పరిశీలించారు. పరిశ్రమ అనుమతులపై పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీ నిర్వహించారు. తనిఖీ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఎఇ తెలిపారు. కాలుష్య నియంత్రణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నామని పరిశ్రమ ప్రతినిధులు అధికారులకు వివరించారు.

విప్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొర్లాం గ్రామస్తులు

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- సోంపేట

మండలం కొర్లాం గ్రామ పరిధిలో గల నూకలూరు, బి.కొర్లాం, హుకుంపేట, గొనకపాడు, లక్ష్మీపురం గ్రామాల్లో విద్యుత్ సమస్యలున్నాయని, వాటిని తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డా. బెందాలం అశోక్‌కు గ్రామ పంచాయతీ తరుపున వినతిపత్రం అందజేశారు. పంచాయతీలో లోఓల్టేజీ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి రాంబుడ్డి గణపతి, ఉప సర్పంచ్ తామాడ వాసుదేవరావు, మాజీ ఎంపిటిసి రత్నాల వెంకటరమణ, కొర్లాం టిడిపి అధ్యక్షుడు పెద్దింటి రాజేష్, నూకల పున్నయ్య, పెద్దింటి శ్రీను, సివంగి సంతు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట ఎపి మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి దుంపల కృష్ణవర్ధన్ రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో వ్యక్తిగత విభాగంలో సెలెక్ట్ అయి దక్షిణ భారతదేశ సైన్స్ ఫెయిర్‌కు వెళ్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ మేరకు సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సభ్యులు విద్యార్థిని అభినందించారు.

దళారులకే ధాన్యం... అర్థం కాని విధానం

- ఏకపక్షంగా సాగుతున్న కొనుగోలు
- అన్నదాతను దోచుకుంటున్న మిల్లర్లు

అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. ఆరుగాలం పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక దళారుల చేతిలో అన్నదాతలు నిండా మునిగి పోతున్నారు. రైతులను అటు దళారులు, ఇటు మిల్లర్లు దోచుకుంటున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఏకపక్షంగా సాగుతుంది. ఎక్కడ చూసినా దళారులు, మిల్లర్లు ఏకమై అన్నదాతను మభ్యపెట్టి దోచుకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు సేకరించిన దానికి, మిల్లులో ఉన్న ధాన్యానికి మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. ప్రతి మిల్లులు వేల బస్తాలతో దర్శనమిస్తున్నాయి. అవి కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చినవి కావు. సగానికి పైగా దళారుల ద్వారా మిల్లుకు చేరినవే కావడం గమనార్హం.

పర్యటనకే పరిమితం

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే వ్యవసాయ, పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలి. అది ఎక్కడ జరగట్లేదు. అధికారులు పర్యవేక్షిస్తూ పర్యటన చేస్తున్నారు తప్ప సిబ్బంది తీరులో మార్పులు మాత్రం రావడం లేదు.

రైతులకు మొండి చేయి

రైస్‌మిల్లు యజమానులు రైతులకు మొండి చేయి చూపిస్తున్నారు. ధాన్యం కొనుగోలుకు వెళితే బ్యాంకు గ్యారంటీలు లేవని చెబుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి రైతులకు న్యాయం చేయాలి.

- మజ్జి అప్పలనాయుడు, రైతు, పాలవలస

కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలు

సాగుతున్న దోపిడీ

కొనుగోలు కేంద్రాల సిబ్బంది కంటే ముందుగానే దళారులు రైతులను సంప్రదిస్తున్నారు. బస్తాకు రూ.1600 నుంచి రూ.1700 ఇచ్చేసి బస్తాకు అదనంగా ఆరు కేజీల నుంచి 8 కేజీలు తూకం వేస్తున్నారు. దగ్గరుండి రైతు ద్వారనే ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్నారు. ధాన్యం మిల్లుకు చేరిన తర్వాత దళారీ తెలిపిన కొనుగోలు కేంద్రంలోనికి వెళ్లి ట్రక్ జనరేట్ చేస్తున్నారు. నేరుగా రైతు కొనుగోలు కేంద్రానికి వెళ్తే మిల్లర్ దగ్గరకు వెళ్లి ధాన్యం మచ్చు చూపించి మిల్లర్లు సరే అంటే ట్రక్‌షీట్ జనరేట్ చేస్తామని కొనుగోలు కేంద్రం సిబ్బంది చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

కళ్లాల్లోనే ధాన్యం

మిల్లర్లు తరుగు ఇస్తేనే ధాన్యం కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. మండలంలో పండించిన ధాన్యం ముక్కలవుతుందని, కొనుగోలు చేయమని మిల్లర్లు చెబుతున్నారు. ప్రస్తుతం తాము పండించిన ధాన్యం కళ్ళల్లోనే నిల్వ ఉండిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలి. బ్యాంకు గ్యారంటీలు దళారులకే కొడుతున్నారు. దీనిపై రైతులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది.

- గేదెల గోవిందరావు, రైతు, లచ్చయ్యపేట

రైతుకు చుక్కలు చూపిస్తున్న మిల్లర్లు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ద్వారా వెళ్లిన రైతుకు మిల్లర్లు చుక్కలు చూపిస్తున్నారు. పలు సాకులు చూపి ఏకంగా ఆరు కిలాలు నుంచి 8 కిలోల వరకు తరుగు రూపంలో ఎక్కువ వేస్తున్నారు. కట్టడి చేయాల్సిన అధికారుల సైతం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మిల్లర్లదే ఇష్టారాజ్యం

మండలంలోని తోటవాడ గ్రామ సమీపంలోని వెంకటరమణ రైస్‌మిల్లు యాజమాన్యం ట్రక్ షీట్ ముందు ధాన్యాన్ని తమ వద్దకు తీసుకువస్తే క్వింటాకు ఎన్ని కేజీలు తరుగు కొట్టాలో చెబుతానని, దానికి రైతు అంగీకారమైతేనే ట్రక్ షీట్ తీసుకుని రావాలని చెబుతున్నారని మండలంలోని లచ్చయ్యపేట గ్రామానికి చెందిన రైతులు గేదెల గోవిందరావు, నీలకంఠం, జీవానందం, తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకు తాము అంగీకరించకపోవడంతో మా ధాన్యాన్ని కొనుగోలుకు అంగీకరించలేదని రైతులు వాపోతున్నారు. దీంతో ధాన్యం బస్తాలు తమ కళ్లాల్లోనే నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని రైతులు వాపోయారు.

పర్యవేక్షణ శూన్యం

అన్నదాతకు అండగా ఉంటామని, ఆందోళన చెందవద్దునని ఒకవైపు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చడం లేదు. ఎక్కడ చూసినా రైతులకు అన్యాయం జరుగుతుంది. అన్యాయాన్ని అరికట్టాల్సిన అధికారులే చోద్యం చూస్తున్నారని రైతులు బహిరంగంగానే ఆరోపణలు గుప్పిస్తున్నారు. పెట్టుబడులు పెట్టి కష్టపడి పండించిన పంట ఇలా దళారుల పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టి రైతులకు న్యాయం చేయాలని మండల రైతుల కోరుతున్నారు.

మిల్లు ఆవరణలో క్యూలో ఉన్న ట్రాక్టర్లు

సోంపేట : బహుమతులు అందుకున్న విద్యార్థులు

నాసిరకం వస్తువులు కొనొద్దు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నడసంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం రామలక్ష్మి అధ్యక్షతన సోషల్ ఉపాధ్యాయుడు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎంఇఒ-2 మల్లారెడ్డి పద్మనాభరావు పాల్గొని విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఏడాది డిసెంబర్ 24న ఒక నిర్దిష్ట ఇతివృత్తంతో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం -1986కు ఈరోజున రాష్ట్రపతి ఆమోదం లభించిందని, అనంతరం 2019లో కొత్త వినియోగ దారుల రక్షణ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా ఎక్స్‌పైరీ తేదీలు పరిశీలించాలని, మోసం జరిగినట్లయితే వినియోగదారుల కోర్టును ఆశ్రయించాలని తెలిపారు. కల్తీ మందులు, నకిలీ వస్తువుల వల్ల మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోయి నాగేశ్వర్, శిశిర జెన్న, వినోదినీ దేవి, ధర్మారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం: వినియోదారుల హక్కుల వారోత్సవాల్లో భాగంగా జరిగిన పలు పోటీల్లో స్థానిక రణస్థలం, కొండ ములగాం మోడల్ స్కూల్ విద్యార్థులు వక్తృత్వపు విభాగంలో 9వ తరగతి విద్యార్థిని ఎం.హిమజారెడ్డి తృతీయ స్థానం కైవసం చేసుకుంది. అలాగే గణిత దినోత్సవం సందర్భంగా గణిత ఫోరం నిర్వహించిన జిల్లా టాలెంట్ టెస్టులో 8వ తరగతి విభాగంలో టి. చైతన్య తృతీయ, కె.కుమార్ రాజా 7వ స్థానంలో, 9వ తరగతి విభాగంలో జి.తేజస్విని 8వ స్థానం విజేతగా నిలిచింది. అంతేకాకుండా జిల్లాస్థాయిలో కెరీర్ ఎగ్జిబిషన్ ఇంటర్ విద్యార్థులైన సుఫియా సాహిన్, దుర్గాప్రసాద్, జి.మోహినులు జిల్లా ప్రథమంగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సోంపేట: జాతీయ వినియోగదారుల దినోత్సవ సందర్భంగా స్థానిక బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ సౌజన్య వినియోగదారుల హక్కులు, వాటి బాధ్యతలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్.మోహన్, అధ్యాపక సిబ్బంది అరుణ్ కుమార్, సుధాకర్, దాలిబంధు, పద్మనాభ చౌదరి, శరత్ బాబు, ఝాన్సీ, రమణ, ఢిల్లేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బెందాళం మల్లేశ్వరరావు, ఒడియా డిఐ దుర్గాప్రసాద్ చౌదరి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడు మృతి

తండ్రితో వెళ్తూ తిరిగి రాని లోకానికి

ప్రజాశక్తి- లావేరు

గణేష్ (ఫైల్)

మండలంలోని తాళ్ల వలస సమీపంలోని జాతీయ రహదారిపై ఈనెల 23న మంగళ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుభద్రపురం గ్రామానికి చెందిన ఇజ్జడా గణేష్ (20) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుభద్రపురం గ్రామానికి చెందిన ఇజ్జడా రమణ పకోడీ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం రణస్థలం వెళదామని తన కుమారుడు గణేష్‌ను తన దిచక్ర వాహనం ఎక్కించుకుని వెళ్తుండగా తాళ్లవలస సమీపంలోకి వెళ్లేసరికి రణస్థలం వైపునుంచి సుభద్రపురం ఎదురుగా వస్తున్న మరో దిచక్ర వాహనం తండ్రి, కొడుకులు ప్రయాణిస్తున్న దిచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో వెనుకవైపున కూర్చున్న గణేష్‌కు బలంగా శరీరంలో దెబ్బలు తగలడంతో వెంటనే శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడు విజయనగరంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గ్రామంలో మంచి యువకుడుగా చెడు అలవాట్లు లేకుండా అందిరితో కలిసి మెలిసి ఉండేవాడు. అయితే గణేష్ మృతి చెందడంతో తండ్రి రమణ, తల్లి సత్యవతి, సోదరుడు, కుటుంబీకులు బోరున విలపించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. లావేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిర్వహించారు.

మృతి చెందిన కృష్ణ

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పట్టణంలోని మండలవీధికి చెందిన జడే కృష్ణ (39) చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు బుధవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. గత మూడు రోజుల క్రితం మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఒకటవ పట్టణ ఎస్ఐ రామారావు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

మహిళా మార్ట్ ప్రారంభం

ప్రజాశక్తి- నరసన్నపేట

మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వెలుగు మహిళా మార్ట్‌ను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందని, దీనిలో భాగంగా మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. మహిళా సంఘ సభ్యుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ మార్ట్ అభివృద్ధి పథంలో నడిచే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, డిఆర్‌డిఎ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మండల మహిళా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా జోగారావు

కొత్తూరు: స్థానిక తహశీల్దార్‌గా వై.జోగారావును నియామకం చేసినట్లు బుధవారం కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈయన బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. ఇక్కడకు వారంరోజుల క్రితం బదిలీపై వచ్చిన వి.శ్యాంకుమార్ జిల్లా కలెక్టర్‌రేట్‌కు బదిలీపై వెళ్లారు. వారంరోజుల్లో తిరిగి బదిలీపై వెళ్లడంతో స్థానికులు చర్చించుకుంటున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కడుమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బీర పల్లవి ప్రతిభ ప్రదర్శించి, రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ఐదవ స్థానంలో నిలిచిందని పాఠశాల హెచ్ఎం గొర్లె తిరుమలరావు తెలిపారు. కాకినాడ జిల్లా, పెద్దాపురం లూథరిన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పరుగుపందెంలో ఐదో స్థానంలో నిలిచిందని ప్రశంసించారు. రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ నేతృత్వంలో, రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొని ఈ ఘనత సాధించింది. పల్లవికి తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు యెన్ని రామకృష్ణను అభినందించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మాదకద్రవ్యాలకు యువత బానిస కాకుండా దూరంగా ఉండాలిని టెక్కలి ఆర్‌డిఒ ఎం,కృష్ణమూర్తి అన్నారు. బుధవారం పాలకేంద్ర దగ్గర వివేకానంద బొమ్మ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు పోలీస్‌శాఖ అద్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ మత్తురహిత సమాజ నిర్మాణమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర' గొప్ప సామాజిక ఉద్యమమన్నారు. మత్తు పదార్థాలు వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబం, సమాజం భవిష్యత్‌ను నాశనం చేస్తాయన్నారు. కోటబొమ్మాళి ఎఎంసి చైర్మన్ బగాది శేషగిరిరావు మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడవద్దని, బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. డిఎస్‌పి లక్ష్మణరావు మాట్లాడుతూ 25 మంది పోలీస్ యువకులు పాయకరావుపేట నుంచి ఇచ్చాపురం వెళున్న యాత్ర శుభ పరిమాణమని, ఈ అభ్యుదయ యాత్రతో యువకులు సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో సిఐ అంబటి విజయకుమార్, ఎంఇఒ తులసిరెడ్డి, ఎస్ఐ రాము, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు వద్దు - జీవితం ముద్దు

కవిటి: స్థానిక ఎస్.వి.జె కళాశాల ఆవరణలో బుధవారం డిగ్రీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు, వాటి నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈగల్ టీమ్ సభ్యులు రత్నరాజు, సంతోష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు మత్తుకు బానిస కాకుండా దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వాడకం వల్ల యువత ఆరోగ్యం, భవిష్యత్ నాశనం అవుతుందని వివరించారు. డ్రగ్స్ సంబంధిత సమాచారం తెలిసిన వెంటనే ఈగల్-1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్.వి.జె డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, ఎన్ఎస్ఎస్ పిఒ ఆర్.మహేష్, డి.బాలు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, నాయకులు

కవిటి : మాట్లాడుతున్న ఈగల్ టీమ్ సభ్యులు

సంతబొమ్మాళి: మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని టెక్కలి రూరల్ సిఐ శ్రీనివాసరావు అన్నారు. టెక్కలి నుంచి నౌపడ మీదుగా పూండి వరకు అభ్యుదయ డ్రగ్స్ నియంత్రణ పోలీసు సైకిల్ యాత్రను నిర్వహించారు. నౌపడ పోలీస్ స్టేషన్ నుంచి నౌపడ జంక్షన్ వరకు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు. అనంతరం నౌపడ జూనియర్ కాలేజీ విద్యార్థులు, ఉన్నత పాఠశాల విద్యార్థులచే డ్రగ్స్ నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.హేమ సుందర్, టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమారావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు అట్టాడ రాంప్రసాద్, టిడిపి యువ నాయకుడు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి, నౌపడ ఎస్ఐ నారాయణ స్వామి, సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ : చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

టెక్కలి : క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

కొత్తూరు : నృత్యాలు చేస్తున్న చిన్నారులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

శ్రీకాకుళం సిటీ: కుష్టు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు అన్నివేళలా అండగా ఉంటామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్థానిక కరుణ సమాజంలో రెడ్‌క్రాస్ సంస్థ, ఆర్ట్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. క్రీస్తు బోధనలు అనుసరణీయమని, పొరుగువారిని ప్రేమించాలని క్రీస్తు చెప్పారని ఆయన పేర్కొన్నారు. సమస్యను తెలుసుకున్నారు. వ్యాధిగ్రస్తుల పెన్షన్, మరుగుదొడ్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్, రేషన్ తదితర విషయాలపై ఆయన చర్చించారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే రెడ్‌క్రాస్, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి పిల్లలకు, పెద్దలకు తినిపించారు. ఈ సందర్భంగా 36 మంది కుష్టువ్యాధి గ్రస్తుల కుటుంబాలకు రెడ్‌క్రాస్, ఆర్ట్ససంస్థల సహకారంతో నిత్యావసర వస్తువులైన కంది పప్పు, వంట నూనె, పంచదార, బియ్యంతో పాటు చీరలు, దుప్పట్లు, టవల్స్ అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన రావు, సెక్రటరీ మల్లేశ్వరరావు, అప్‌హోల్డ్ ప్రాజెక్ట్ మేనేజర్ తిమోతి, ఎం.సి.మెంబర్లు డాక్టర్ నిక్కు అప్పన్న, నూక సన్యాసిరావు, హరి సత్యనారాయణ, చిన్మయిరావు, జి.రమణ, సత్యనారాయణ, చైతన్యకుమార్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం: స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, ఫాస్టర్ గంజి ఆర్ ఎజ్రా, ఫాస్టర్ తిరుపతి రావు, క్లబ్ ప్రతినిధులు నగిరి ఉపేంద్ర, గుడ్ల జగ్గారావు, గేదెల లక్ష్మి, సుగంధం సంజీవరావు, నల్లబాటి కృష్ణమూర్తి, వినీల, జ్యోతి, సాయిరాం, కొమర భాస్కరరావు, నాగేశ్వర ఈశ్వరరావు, గుడ్ల గోపాలరావు, కట్టా సారధి పాల్గొన్నారు.

మెళియాపుట్టి: క్రిస్మస్ సందర్భంగా పాతపట్నం జనసేన నాయకులు కొరికాన భవాని క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. మండలంలో వివిధ ప్రార్థన మందిరాలకు చెందిన 44 మందికి నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల జనసేన నాయకులు దుక్క బాలరాజు, వసుంధర గ్రామ సర్పంచ్ సలాన అప్పలనాయుడు, ఎఎంసి డైరెక్టర్ చింతల ప్రశాంత్, తిరునగరు ప్రసాద్, సవర రామ్మూర్తి, నల్లకాంతం చిన్నికృష్ణ, దొర విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక స్వర్ణభారతి ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రాంగణంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి వేడుకల ప్రాధాన్యత తెలియజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన కాంతాస్లైడ్ వేషాధారణ అందరిని ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో స్వర్ణ భారతి విద్యాసంస్థల కో-ఆర్డినేటర్ చాట్ల మహేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ లీలాలక్ష్మి, విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: టెక్కలి ఐతమ్ కళాశాలలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరావు తెలిపారు. ఈ వేడుకల్లో అసోసియేట్ డీన్ డా యుగంధర్, డా ప్రసన్నలక్ష్మి, శాక్ కోఆర్డినేటర్ సురేష్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు క్రిస్మస్ క్యారల్స్, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేసి కేక్‌కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

పొందూరు: మండల కేంద్రంలోని శ్రీ వేద పాఠశాలలో ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. శాంతక్లాస్ వేష ధారణలతో చిన్నారులు ఎంతగానో ఆకర్షించారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బోడ బాబూరావు, ప్రిన్సిపాల్ నల్లా రామకృష్ణ, కరెస్పాండెంట్ బోడ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి: పట్టణంలోని ఓక్లాండ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మళ్ల మధులత విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు క్రిస్మస్ పాటలు, నృత్యాలు, నాటికలు అందరినీ ఆకట్టుకున్నారు.

కొత్తూరు: క్రిస్టమస్ వేడుకల సందర్భంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద పాస్టర్ పి.వి.రమణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిన్నారులు పాటలు పాడి చూపరులను ఆకట్టుకున్నారు. ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

మెళియాపుట్టి : కానుకలు అందజేస్తున్న నాయకులు



పొందూరు : క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, చిన్నారులు

ఇచ్ఛాపురం : కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

ఇండోర్ స్టేడియం పనులు పున:ప్రారంభం

పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- నరసన్నపేట

గత ప్రభుత్వంలో అర్ధంతరంగా నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం పనులకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఇండోర్ స్టేడియం ఫ్లోరింగ్, వుడెన్ వర్క్ పనులకు రూ.49 లక్షలు నిధులు మంజూరు చేసి, పనులను బుధవారం పున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని, క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయన్నారు. త్వరలో ఇండోర్ స్టేడియం అందు బాటులోకి రానుందన్నారు. పనులు పూర్తి చేసేం దుకు అవసరమైన నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు క్రీడా కారులు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ సమన్వ యకర్త బగ్గు అర్చన, కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దిమ్మిడిజోలలో పారిశుద్ధ్య పనులు

నందిగాం: మండలంలోని దిమ్మిడిజోల గ్రామంలో సర్పంచ్ సలాన దేవమ్మ ఆధ్వర్యంలో బుధవారం పారిశు ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమాలల్లో భాగంగా డ్రైనేజీలో క్లీనింగ్, సిల్ట్ ట్రాక్టర్ ద్వారా తరలింపు చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి సంతోష్ కుమార్, టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ సలాన నాగమ్మ, కృష్ణారావు పాల్గొన్నారు.

మిత్రుని జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం

కవిటి: తమ మిత్రుడు అజయ్ సాహు జ్ఞాపకార్థం ఓ మంచి పని చేయాలనే తలంపుతో మాణిక్యేశ్వరీ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సహకారంతో మాణిక్యపురంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కిడ్నీ డయాలిసిస్ పేషెంట్లకు అవసరమైన రక్తం అందించడమే ముఖ్య లక్ష్యంగా చేపట్టిన ఈ శిబిరంలో చుట్టుపక్కల గ్రామాల యువత స్వచ్ఛందంగా పాల్గొని మొత్తం 26 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో కవిటి పిహెచ్‌సి వైద్యులు ధనలక్ష్మి, మాణిక్యేశ్వరీ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆర్థికసాయం

కోటబొమ్మాళి: స్థానిక హడ్కోకాలనీకి చెందిన దేవాది మహేశ్వరరావు పక్షవాతంతో బాధ పడుతుండటంతో ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం సంతబొమ్మాళి మండలం వల్లేవలసకు చెందిన మాబడి స్వచ్ఛందసేవా సంస్థ సభ్యులు రూ.8 వేలు బుధవారం ఆర్థికసాయం అందజేశారు. అలాగే సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామానికి చెందిన జీరు చిన్నారావుకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోవడంతో ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి టిడిపి సీనియర్ నాయకులు నౌగాపు నాగరాజు, సేవా సంస్థ సభ్యులు రెడ్డి సూరిబాబు మాస్టర్, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, విష్ణు, వందన తదితరులున్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

కవిటి: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాము దీక్షలు చేస్తున్నామని బెంతు ఒరియా ప్రతినిధులు హరికృష్ణ బిసాయి, సుమన్ బిసాయి తెలిపారు. బెంతు ఒరియాల సమస్యల పరిష్కారానికి చేస్తున్న దీక్షలు 703వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థల ప్రభావం, కొన్ని అనివార్య కారణాలవల్ల దీక్షలకు కొంత అంతరాయం కలిగిందని, మళ్లీ యథావిధిగా తమ దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఏదిఏమైనా తమ అంతిమ లక్ష్యం బెంతు ఒరియాల సమస్య పరిష్కారమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దుదిష్టి మజ్జి, కృష్ణ దల్లై తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

రణస్థలం: స్థానిక కొండ ములగాం మోడల్ స్కూల్ అండ్ కాలేజీ ఇంటర్మీడియట్ విద్యార్థులు సుఫియా షాహీన్, జి.మోహిని, వి.దుర్గాప్రసాద్‌లు కెరీర్ ఎగ్జిబిషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమస్థానం విజేతగా నిలిచారని, వీరిని రాష్ట్రస్థాయి పోటీకి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. విద్యార్థుల ఎంపికపై ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్రస్థాయిలో కూడా ప్రథమస్థానం రావాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

తమ్మినేని పరామర్శ

బూర్జ: ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మృతురాలి కుటుంబసభ్యులను మాజీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం పరామర్శించారు. కొల్లివలస గ్రామంలో కొండలరావు భార్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామ ర్శించారు. ముందుగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఆయనతో కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

అప్పన్న, ఎఇ

బూర్జ: మండలంలోని అల్లెన నుంచి 11 కెవి ఎస్ఎస్ నందు మరమ్మతుల కారణంగా అల్లెన పరిధిలో ఉన్న డొంకల పర్త, పాలవలస, పెద్దపేట, తుద్దలి తదితర ప్రాంతాల్లో శు క్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ శాఖ ఎఇ అప్పన్న తెలిపారు. ప్రజలు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

మాట్లాడుతున్న పద్మనాభం

ఇచ్ఛాపురం : గ్రామ పంచాయతీలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు దృష్టి సారించాలని మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు లోపింటి పద్మనాభం, దక్కత కామేశ్వరరావు అన్నారు. బుధవారం లొద్దపుట్టి తులసమ్మ ఆలయ ప్రాంగణంలో మండల టిడిపి నాయకుల సమావేశం నిర్వహించారు. మండల ప్రెసిడెంట్ పద్మనాభం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పంచా యతీలకు సంబంధించి పలు విషయాలపై చర్చించారు. మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు, పిఏసిఎస్ అధ్యక్షులు బాబ్జి, మండల సెక్రటరీ డి. కామేష్, సాడి సహదేవ్, డి.సూర్య నారాయణ, బోర ప్రసాద్, హరీష్, ఎర్రయ్య, లోహిదాస్, చంద్రశేఖర్, ఆశి మాధవ్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సాగు యాజమాన్యంపై శిక్షణ

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బల్లిపుట్టుగలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రబీ 2025-26 సీజన్‌కు సంబంధించి పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులపై బుధవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చోడి, కొర్ర పంటల్లో ఎరువుల యాజమాన్యం, పురుగు, తెగులు నియంత్రణపై రైతులకు శాస్త్రీయంగా అవగాహన కల్పించారు. రైతులు ఎదుర్కొంటున్న సాగు సమస్యలకు శాస్త్రవేత్తలు ప్రత్యక్షంగా పరిష్కార మార్గాలు సూచించారు. అలాగే సాగు పొలాల్లో ఎలుకలు, అడవి పందుల సమస్యను ఎదుర్కొనేందుకు రైతులు సామూహికంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సోంపేట సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవాని శంకర్, రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పి.ఉదయబాబు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వై.సురేష్, మండల వ్యవసాయాధికారి పి.శ్రీదేవి, వి.హెచ్.ఎ జగదీష్, రైతులు పాల్గొన్నారు.

పోలియోలో ఉత్తమ సేవలకు సన్మానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పల్స్‌పోలియో ద్వారా శతశాతం పోలియో చుక్కలు వేయించి నందుకుగాను వారి సేవలను గుర్తించి పల్స్‌పోలియో క్లబ్ ఛైర్మన్ డి.మధు కుమార్, ఫార్మిస్ట్ ఆఫీసర్ బెంకాల రఘునాధరావుకు ఘనంగా సన్మానించారు. రోటరీ చార్టర్ ప్రెసిడెంట్ డా. డి. త్రినాథరెడ్డి, పల్స్‌పోలియో జిల్లా రీజనల్ ఛైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి, ప్రెసిడెంట్ డా. టి. మోహన్ వెంకటేష్ రెడ్డి, సెక్రటరీ కె.రామకోటి కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా డా. డి. త్రినాథ రెడ్డి మాట్లాడుతూ రఘునాధ రావు పల్స్‌పోలియో కాకుండా ప్రతీనెల ప్రజలకు వ్యాధులు రాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని అవగా హన కల్పిస్తారని, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కె.గోపిచౌదరి, దక్కత కృష్ణమూర్తి రెడ్డి, యు.శ్యాం రెడ్డి, అమీర్‌అలీ, కిరణ్‌కుమార్, వైద్య సిబ్బంది, రఘుబాబు పాల్గొన్నారు.

నృత్యోత్సవానికి కళాకారుల ఎంపిక

తిరుపతి నృత్య ప్రదర్శనకు వెళ్తున్న నాట్య కళాకారులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

తిరుపతి నృత్యోత్సవానికి ఇచ్ఛాపురం నాట్య కళాకారులు ఎంపికయ్యారు. 3వ భారత్ కల్చరల్ డాన్స్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో నెల 25, 26, 27 తేదీల్లో అవార్డు 2025 శ్రీకృష్ణ నాట్య మధుబాల, శ్రీకృష్ణ నాట్య ముద్రిత తిరుపతిలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీ స్వేచ్ఛానృత్యం తరంగిణి బృందం బుధవారం ప్రయాణమయ్యారు. ఈ నృత్య ప్రదర్శన కోసం నాట్య కళాకారులు డి.శిరీష పట్నాయక్, టి. చైత్ర, భవ్య, జై మాన్విష, డి.యశోద, బి.ఎస్విత, శ్రావణి నాట్య ప్రదర్శనలో పాల్గొననున్నారు. కళాకారులకు నాట్యగురువు మంగి దివ్య, అకాడమి అధ్యక్షులు గోవిందరావు, కోశాధికారి మంగి దాలమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమాలు మహతి ఆడిటోరియం తిరుపతిలో జరగనున్నాయని అకాడమి అధ్యక్షులు గోవిందరావు తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా

ఆర్థికసాయం అందజేస్తున్న రామమూర్తి తదితరులు

లావేరు: మండలంలోని గుమ్మడాం చెందిన నారు అమావాస్య కుటుంబాన్ని ఆదుకుంటామని టిడిపి యువ నాయకుడు మజ్జి రామమూర్తి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నారు అమావాస్య కుటుంబ సభ్యులను రామమూర్తి బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థికసాయం అందజేసి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముప్పిడి వెంకటేష్, దుర్గారావు, జి.సూర్యారావు, జె.అప్పలనాయుడు, నారు దుర్గారావు, నాగం నీలకంఠం, మోహనరావు తదితరులున్నారు.

178 గ్రామాల్లో స్వామిత్వ సర్వే

సర్వే పరిశీలిస్తున్న రమణ

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపడుతున్న స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలని, పలాస డివిజన్ పరిధిలో 178 గ్రామాల్లో స్వామిత్వ సర్వే జరుగుతుందని టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారి ఐ.వి రమణ అన్నారు. మండలం బ్రాహ్మణతర్ల, లక్ష్మీపురం గ్రామాల్లో బుధవారం స్వామిత్వ సర్వేను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస డివిజన్ పరిధిలో మొదటి ఫేజ్‌లో 5 గ్రామాలు, ఫేజ్ 2లో 143 గ్రామాలు, ఫేజ్ 3లో 178 గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు. స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక దృష్టి సారించి సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, కార్యదర్శులు బసవ శ్రీనివాసరావు, సాయి, జి.జానకిరాం తదితరులు పాల్గొన్నారు.

నైతిక విద్య జీవితానికి పునాది

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

జీవన విలువలు, నైతికత, సంస్కారం, ధర్మబద్ధమైన ఆలోచనలతో కూడిన విద్యయే విద్యార్థి జీవితానికి నిజమైన పునాది అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యానైతిక విలువల సలహాదారులు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. మండల లోని ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో బుధ వారం చాగంటి కోటేశ్వరరావు విద్యార్థుల జీవితాలకు దారి చూపేలా స్ఫూర్తిదాయకమైన ప్రవచనాలను అందించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలనే ఉన్నత సంకల్పంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ధర్మనిష్ఠను నాటేలా అమృత వ్యాఖ్యలను అందించారు. ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ నడుకుదిటి తేజ బాబు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ, విద్యార్థులు, తల్లిదండ్రులు,పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి

లావేరు: మండలంలోని తాళ్లవలస సమీపంలోని సుబద్రాపురం జాతీయ రహదారి వంతెనపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీని మరో లారీ ఢీకొనడంతో అదే లారీని నడుపుతున్న క్లీనర్ మీద కృష్ణ (54) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు లారీ డ్రైవర్ ఇమాన్ అలీ బిశ్వాస్ ఫిర్యాదు ప్రకారం వీరు వీరులలోడుతో విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తుండగా తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో డ్రైవర్ నిద్రిస్తుండగా క్లీనర్ కృష్ణ లారీని నడుపుతున్న క్రమంలో సుద్రాపురం వంతెనపైకి వచ్చేటప్పటికే అజాగ్రత్తగా స్పీడుగా ముందు వెళ్తున్న మరో లారీ బలంగా ఢీకొనడంతో క్లీనర్ కృష్ణను స్టిరింగ్ నొక్కేయడంతో తీవ్రంగా గాయపడటంతో డ్రైవర్ 108 సహాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునిది వెస్టబెంగాల్ వైద జిల్లాకు చెందిన వాడు. పోలీసులు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి జిల్లా ఉపాధ్యక్షునిగా 'సనపల'

ఆమదాలవలస: జిల్లా టిడిపి ఉపాధ్యక్షులుగా మండ లానికి చెందిన నారాయణపురం ఆనకట్ట ఛైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావును ప్రకటించగా కార్యనిర్వాహక కార్యదర్శిగా మున్సిపాలిటీకి చెందిన పిఏసిఎస్ అధ్యక్షులు శిమ్మ మాధవి, సరుబుజ్జిలి మండలం తెలికిపెంట సర్పంచ్ ప్రతినిధి నందివాడ గోవిందరావుకు జిల్లా టిడిపి స్పోకెన్ పర్సన్‌గా, పొందూరు మండలానికి చెందిన సీపాన రంగ నాయకులను కార్యదర్శిగా, ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడకు చెందిన మాజీ వైస్ ఎంపిపి వండాన ఉద యకుమార్‌ను జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శిగా ప్రకటి ంచారు. నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులకు జిల్లా టిడిపిలో సముచిత స్థానం కల్పించడానికి కృషి చేసిన ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.